
# అలజడి




అక్కడ నిలబడి ఇంకా పూర్తిగా అయిదు నిమిషాలేనా కాలేదు. ఒళ్లంతా వేడెక్కి జ్వరం వచ్చినట్టుగా ఉంది రమకి. అన్న టైముకి ప్రసాద్ వస్తాడన్న నమ్మకం ఉంది. అయినా అదోరకం కంగారు.

ఆ టైముకి తనని అక్కడికి రమ్మన్నమన్నది ప్రసాదేనని, అతను ప్రత్యేకంగా వచ్చేది తన కోసమే అని రమకి తెలుసు. పైగా ఇటువంటి ఏర్పాటు యిది మొదటిసారి కాదు. అతను అలా రావటం, ఇద్దరూ కలిసి వెళ్లటం ఇది వరకూ జరిగింది.

బస్‌స్టాప్‌లో తన చుట్టూ ఉన్న జనాన్ని మరోసారి చూసింది రమ. తనని ఎవరేనా పరీక్షగా చూస్తున్నారేమోనన్న అనుమానం.

ఆ వారంలో అది మూడోరోజు. కాలేజీ మానెయ్యటం, తెలిసున్న వాళ్లెవరేనా తను కాలేజీ

మానేసిన విషయం గమనిస్తారేమో, అలా గమనించిన వాళ్లు ఇంట్లో చెపుతారేమోనన్న భయం.

కాలేజీ మానేసినప్పుడల్లా రకరకాల అబద్ధాలు.... దొంగ లీవ్‌లెటర్లు. తల్లీ తండ్రిని మోసం చేయాల్సిన అయిష్టత.

ఈ ఇబ్బందులన్నీ ప్రసాద్ కోసం. అతనితో గడిపే సమయం కోసం. ప్రసాద్ బావుంటాడు. బావుండటమే కాదు, ఎంతో చక్కగా మాట్లాడతాడు. అతనితో కలిసి గడుపుతోంటే కల, మెలుకువ కలగలిసినట్టు మరో ధ్యాసే ఉండదు. అయినా తను జాగ్రత్తగానే ఉంటోంది. ప్రసాద్‌ని ఎంతవరకూ ఉంచాలో అంతవరకే ఉంచుతోంది. ఎంతో జాగ్రత్తగా, మరెంతో నేర్పుగా తన శరీరం అతనికి పూర్తిగా అర్పణ కాకుండా చూసుకుంటోంది.

ఆలోచనే కాదు.... పరిస్థితి, మనస్థితి రెండూ గందరగోళంగానే ఉన్నాయి రమకి.

తన స్నేహితుల అనుభవాలు వింటోంది. సినిమాల్లో ఇలాంటివెన్నో చూస్తోంది. వాళ్ల స్థితీ తనలాంటిదే. తేడా అల్లా తనకి డబ్బు ఇబ్బందులు కొంచెం ఎక్కువ.

తల్లీ, తండ్రీ ఇద్దరివీ చిన్న జీతాలే. ఇద్దరూ ఎంతగా కష్టపడినా ఇంటి అవసరాలు తీరటమే కష్టంగా ఉంది. తనకి ప్రతి పైసా లెక్క చూసి ఇస్తారు. అంతకు మించి వాళ్లు ఇవ్వనూ లేరు. తను అడిగీ లాభం లేదు. ఇరవై ఏళ్ళేనా దాటని తన పెళ్లి గురించి, మంచి సంబంధాల గురించి, ఇవ్వాల్సిన కట్నాల గురించి వాళ్లకి అనుక్షణం బెంగే. ఆ బెంగలో కూరుకుపోయిన వాళ్లకి తన ఆశలు, ఆలోచనలు తెలుసుకునే సమయం లేదు. ఓపిక అంతకన్నా లేదు. కూతురికి ఏదో రకంగా పెళ్లి చేసేస్తే చాలన్నదే వాళ్ల ఆలోచన. వయసొస్తున్న తను వాళ్ళకో బరువు.

అలాంటి తనకి ఈ దారి తప్పు కాదు. అనవసరం అంతకన్నా కాదు.

ప్రసాద్ తనంటే ఇష్టపడుతున్నాడు. అభిమానిస్తున్నాడు. తన అవసరాలు తీరుస్తున్నాడు.

కాలేజీలో తోటి స్నేహితుల మధ్య కొంతవరకేనా హుందాగా, ఉత్సాహంగా కనపడుతోందంటే దానిక ప్రసాదే కారణం. కొత్త డ్రెస్‌లు, కాస్మోటిక్స్, చెప్పులు.... ఇలా సరదాలు తీరుతున్నాయంటే..... అది ప్రసాద్ వల్లే....

ఎటొచ్చీ అవి స్నేహితులువనీ కొద్ది రోజులు ఉంచుకుని తిరిగి ఇచ్చేస్తానని ఇంట్లో అబద్ధాలు చెప్పాలి. చెపితే ఏం? ఈసురోమని ఏడుపు ముఖం వేసుకుని తిరగకుండా, ఉత్సాహంగా ఉండగలుగుతోంది. అది చాలదా? అసలు జీవితం ఎందుకు? ఉత్సాహంగా గడపటానికేగా! అదీగాక ప్రసాద్ తనని పెళ్ళి చేసుకుంటాడు.

ఎంతగా సమర్థించుకున్నా మనసు స్థిమిత పడటంలేదు రమకి. అంతేకాదు ఇంకా చాలారకాల భయాలు కలుగుతున్నాయి.

ప్రసాద్ తొందరని, కోరికని తను అడ్డుకోలేని క్షణం వస్తే.... లొంగిపోతే.... ఆ తర్వాత ఎదురయ్యే ఇబ్బందుల వల్ల పదిమందిలో తను అల్లరైపోతే, ఒకవేళ ప్రసాదే కాదంటే.... ఆ తర్వాత అసలు తనకి పెళ్లే జరగని పరిస్థితి వస్తే.... ఆ పరిస్థితులకి తట్టుకోలేక అమ్మా నాన్నా ఏమైనా అయిపోతే....

కాదు..... అలా జరగదు..... అలా జరగనివ్వకూడదు. ప్రసాద్ తనవాడవుతాడు. తను అతన్ని తనవాడిగా చేసుకుంటుంది..... చేసుకోవాలి.

ఓ పదేళ్లక్రితం, పద్దెనిమిదేళ్ల ఆడపిల్ల మనసు దరిదాపులకి కూడా రాని చాలా ఆలోచనలు,

ఆందోళనలు చాపకింద నీరులా రమని కమ్మేసి చాలాకాలం అయింది. ఇప్పుడు రమ కేవలం కాలేజీలో చదువుకునే కన్నెపిల్లకాదు. తనకేం తప్పు కనిపించని ఓ తప్పనిసరి దారే తన ప్రయాణం, అనుకునే విచిత్ర ఆలోచనా రూపం.

ప్రసాద్ కారు కనిపించింది రమకి. తాత్కాలికంగా రిలీఫ్.

ఉత్సాహం తెచ్చుకుని హుషారుగా కారెక్కింది. మామూలుగానే ఇద్దరూ ఖాళీగా ఉండే ఖరీదైన రెస్టారెంట్‌కి వెళ్లారు. ఆ తర్వాత మార్నింగ్‌షోకి వెళ్లారు. తిరిగి మళ్లీ మరో రెస్టారెంట్‌లో కబుర్లు. రమ అడక్కుండానే కొత్త డ్రెస్ కొన్నాడు ప్రసాద్. డ్రెస్‌తో పాటు దానికి సంబంధం ఉండీలేని మరికొంత షాపింగ్ చేశారు. తియ్యని ప్రేమలాంటి ఆ ట్రిప్ యధావిధిగా ఎంతో బావుంది రమకి. చీకటి, కనుమరుగు సహకరించిన సమయంలో రమ శరీర స్పర్శని వీలున్నంతగా అనుభవించాడు ప్రసాద్.

అంతా బాగానే గడిచింది. సాయంత్రం రమని వదిలేసే ముందు మాత్రం ప్రసాద్ గట్టిగా ఆ విషయం ఒకటికి రెండుసార్లు చెప్పాడు.

వచ్చే సోమవారం ఒక రూము ఏర్పాటు చేశానని, ఇద్దరూ ఆరోజు ఆ రూమ్‌లో రొమాంటిక్‌గా గడపాలని, ఆరోజు రమ రూమ్‌కి రాకపోతే అతనికి చాలా బాధ కలుగుతుందని... అతని మాటల్లోని అంతరార్థం రమకి బాగా అర్థమయ్యేలాగే చెప్పాడు.

ఇంటివేపు నడుస్తుంటే ఆనాటి ఉత్సాహమంతా నీరుకారిపోయింది రమకి.

కొత్త డ్రెస్, చేతిలో పాకెట్స్ ఇంట్లో వాళ్లకి కనపడకుండా లోపలికి చేర్చాలి. ఒకవేళ వాళ్ల కళ్లపడితే ఏదో కథ చెప్పాలి. సోమవారం కాలేజీకి లీవ్‌లెటర్ మీద తల్లి చేత సంతకం చేయించాలి. మరేదో వంక చెప్పి సోమవారం ఇంట్లోంచి బైటపడాలి. ప్రసాద్‌తో రూమ్‌కి వెళ్లకుండా తప్పించుకోవాలి. ఒకవేళ వెళ్ళినా అతనికి దూరంగానే ఉండాలి. ఈసారైనా తమిద్దరి పెళ్లి ప్రసక్తి తీసుకురావాలి.

ఆరాటం కలిగించే ఆలోచనలు.... వాటి నీడలా అనుమానాలు. పెళ్లి విషయం విని ప్రసాద్ చిరాకుపడితే.... ఇప్పుడే పెళ్ళి ప్రసక్తి తీసుకురావటం మంచిదేనా?

ప్రసాద్‌లాంటి వాణ్ని అందుకోటానికి కాలేజీలో తనలాంటి ఆడపిల్లలు చాలామంది రెడీ. ప్రసాద్‌ని చెయ్యి జారనివ్వకూడదు.

ఇప్పుడు కాకపోతే ప్రసాద్‌తో పెళ్ళి గురించి మరెప్పుడు మాట్లాట్టం? ఏమో?

అంతా ఆందోళనే రమకి. పద్దెనిమిదేళ్ల రమ పసి మనసు ఆలోచనల నరకంలో నానాయాతనగా ఉంది. ఊపిరి సలపనట్టు, ప్రాణం పోతుందేమో అన్నట్టు ఏదో ఇబ్బంది. 'తమ పిల్ల ఇంకా చిన్నదే. చదువు తప్ప ఆ పిల్లకి ఇంకేం కష్టంలేద'నుకునే రమ తల్లీ తండ్రికి ఈ క్షోభ తాలూకు ఛాయ కూడా తెలియదు. ఇద్దరి లోకాల మధ్య ఎంతో దూరం.

ఆ దూరానికి కారణమేమిటో రమకీ తెలియదు.... రమకే కాదు, రమలాంటి ఎందరో ఆడపిల్లలకీ తెలియదు.

నిజమైన జీవితం ఒకటి.... ఆశాలోకం మరొకటి....

చిక్కటి చీకటిలో నడుస్తున్న రమకి, తమ పక్కింటి విజయలక్ష్మి ఎపార్ట్‌మెంట్‌లో కనిపిస్తున్న లైట్ వెలుగు పెద్ద కాంతిలా కనిపించి 'హమ్మయ్య' అనుకుంది.

రమకి విజయలక్ష్మి అంటే ఇష్టం. ఒంటరిగా, ధైర్యంగా, గొప్పగా బతుకుతున్న విజయలక్ష్మి అంటే ఆరాధన. విజయలక్ష్మి ఇల్లు, ఆ యింట్లో పుస్తకాలు, వస్తువులు, ఆమె మాటలు అన్నీ నచ్చుతాయి

రమకి. విజయలక్ష్మికి ముప్పై ఏళ్లు దాటకపోయినా రమ ఆమెని 'ఆంటీ' అని పిలుస్తుంది.

విజయలక్ష్మి ఫ్లాట్ తలుపు తీసే ఉంది. మరింత హాయిగా లోపలికెళ్లింది రమ.

తన దగ్గరున్న పాకెట్స్ అన్నీ ఆమె ముందు పెట్టి "ఆంటీ ఇవి ఇక్కడ ఉండనివ్వండి. తర్వాత తీసికెడతా" అంది.

విజయలక్ష్మి కూచోమన్నా కూచోలేదు. అప్పటికే ఆలస్యమైందన్న కంగారు.

'ఆదివారం వస్తా.... మీరూ కొంచెం ఫ్రీగా ఉంటారుగా....' అంటూ వచ్చేసింది.

కొంత బరువు తగ్గింది. ఆలస్యం అయినందుకు ఏదో ఒకటి చెపితే ఆ రోజుకి ఇంక ఇబ్బంది లేదు. తరువాత సంగతి తర్వాత.

స్నేహితురాలితో షాపింగ్‌కి వెళ్లానని తల్లితో అబద్ధం ఆడేశాక మరికొంత కంగారు తగ్గింది రమకి. శుభ్రంగా స్నానం చేసి, అన్నం తిన్నాక పూర్తిగా తెరిపిన పడింది.

మంచం మీద ఒరిగాక ప్రసాద్ గుర్తొచ్చాడు. అతని స్పర్శ గుర్తొచ్చింది.

ప్రసాద్ ముట్టుకున్నప్పుడల్లా తన శరీరం కోరికతో మంటలా మారుతోంది. 'జాగ్రత్తపడే పద్ధతులున్నాయిగా.... ప్రసాద్‌తో ఆ సుఖం అనుభవిస్తే.... అమ్మో! ఇంకేమైనా ఉందా....

'పోనీ.... సోమవారం ప్రసాద్‌తో ముందే సూటిగా పెళ్లి విషయం మాట్లాడేస్తే? ఏమో ఏం జరుగుతుందో?

సరదాగా, ప్రేమగా మాట్లాడే ప్రసాద్ ఒక్కోసారి చాలా కటువుగా మాట్లాడతాడు.

'ఈరోజుల్లో ఎవరికీ ఏదీ ఊరికే దక్కదు. అన్నింటికీ విపరీతమైన పోటీ.... ప్రతివాళ్లకి ఏదో రకంగా పైకి రావాలన్న పట్టుదల, కృషి ఉండాలి. కొంత రిస్క్ తీసుకోవాలి. ఓ స్థాయికి వస్తేనే జీవితం, అనామకంగా ఉండిపోయే వాళ్లకి లైఫ్ లేదు.... తెలుసుకో....' అదీ ప్రసాద్ ధోరణి.

'ఏం చెయ్యాలి? ఏమో?'

'ఏ ఆడపిల్లకీ తల్లీ తండ్రీ తొందరపడి పెళ్లి చెయ్యకూడదు. తమ కూతురే తమకి బరువు అనుకునే దౌర్భాగ్యం వుండకూడదు. ఇష్టంగా, కోరికలన్నీ తీరే చక్కటి ప్రయాణంలా ఉండాలి పెళ్లి.... విజయలక్ష్మి ఆంటీ లాంటి స్వేచ్ఛాగానం లాంటి జీవితం ఉండాలి'.

ఆలోచిస్తూనే నిద్రపోయింది రమ.

కలత నిద్దర్లో కల. తన కళ్లెదురుగానే ప్రసాద్, విజయలక్ష్మి ఒకటైపోతున్నట్టు కల. ఆ కల సాగినంతసేపూ, నిద్దర్లో కూడా ఎంతో కంగారుపడింది రమ.

★ ★ ★

ముందుగా అనుకున్నట్టే ఆదివారం విజయలక్ష్మి ఇంటికి వెళ్లింది రమ.

ఫ్లాట్ తాళాలు అడగాలి. సోమవారం కొంచెం ముందుగా వెళ్లి ఆంటీ ఇంట్లో కొత్త డ్రెస్ వేసుకుని ఆ డ్రెస్‌కి మాచింగ్‌గా ముస్తాబై ప్రసాద్‌ని కలవటానికి వెళ్లాలి. అసలే తనంటే ఇష్టపడే ప్రసాద్ మతిపోయేలా తయారవ్వాలి. తన అందమే తనకున్న బలం. తర్వాత పరిస్థితుల్ని బట్టి జాగ్రత్తగా నడుచుకోవాలి.

రమ వెళ్లటమైతే వెళ్లింది కానీ విజయలక్ష్మి ఇంట్లో ఆమె అనుకున్నట్టు జరగలేదు. తాళాలు అడుగుతూ కంగారుపడింది.

మృదువుగానే అడిగినా చాలా ఖచ్చితంగా, సూటిగా అడిగింది విజయలక్ష్మి "నీ కంగారు,

ఆరాటం నువ్వు దాస్తే దాగేవి కావు.... అసలు విషయం ఏమిటి? నా మీద నమ్మకం ఉంటేనే చెప్పు. అంతే తప్పు అడిగాను కదా అని అబద్ధాలు చెప్పకు...."

అసలే మనసంతా సందేహంగా, అయోమయంగా ఉంది రమకి. ప్రసాద్‌తో అప్పటివరకూ ఉన్న పరిచయంలో సినిమాలకి, రెస్టారెంట్స్‌కి వెళ్లటం తప్ప, రూముకి వెళ్లటం అన్న పరిస్థితి రాలేదు. అతని మీద కొంత నమ్మకం ఉన్నా, అక్కడేం జరుగుతోందనన్న భయం క్రుంగదీస్తోంది. ధైర్యంగా వెళ్లనూ లేదు. అలా అని వెళ్లకుండా ఉండనూ లేదు.

కొద్దికాలం క్రితం ఒంటరిగా ఆ ఫ్లేట్‌లోకి దిగిన విజయలక్ష్మి గురించి రమ తల్లిదండ్రులతో సహా చుట్టుపక్కల వాళ్లు చాలామంది చాలా రకాలుగా అనుకున్నారు. ఆ తర్వాత విజయలక్ష్మి పద్ధతి, నడవడి చూసి సరిపెట్టుకున్నారు. తన జీవితమేదో తనది, ఇతరులకి ఏ మాత్రం ఇబ్బంది కలిగించను, అన్న పద్ధతిలో సూటిగా, ప్లెయిన్‌గా ఉండే విజయలక్ష్మి అంటే కొందరికి అభిమానం కూడా ఏర్పడింది.

విజయలక్ష్మి చాలా మోడరన్‌గా ఉంటుంది. చక్కగా డ్రెస్ చేసుకుంటుంది. మంచి మ్యూజిక్ వింటుంది. మంచి పుస్తకాలు, మాగ్జైన్స్ చదువుతుంది. ఏడ్ ఏజెన్సీ ఎగ్జిక్యూటివ్‌గా మంచి జీతం, మంచి స్టేటస్, వీటన్నింటికన్నా ఏ భేషజం లేకుండా సూటిగా, సింపుల్‌గా మాట్లాడటం రమకి ఎంతో నచ్చిన విషయం. భిన్నమైన పరిస్థితుల్లో కూడా విజయలక్ష్మి నిండుగా, పాజిటివ్‌గా బతగ్గలగటం రమకి ఆకర్షణీయంగా, ఇష్టంగా ఉన్న విషయం. అందుకే ఆమె అలా అడిగేటప్పటికి తన మనసులోని గందరగోళమంతా దాచుకోలేక మొత్తం సంగతంతా వివరంగా చెప్పేసింది రమ.

తనకున్న భయాలు, ఆలోచనలు, కంగారు, తన కోరికలు, ఆఖరికి రాత్రి ప్రసాద్, విజయలక్ష్మిల మీద తనకొచ్చిన కల అన్నీ చెప్పేసింది రమ. అంతా చెప్పేసి 'నన్నేం చెయ్యమంటారో మీరే చెప్పండి ఆంటీ' అన్నట్టు కూచుంది.

విజయలక్ష్మికి రమ పరిస్థితి అంతా అర్థమైంది. ఆ పిల్లకి కావాల్సింది సలహా కాదు. కంగారు నుంచి బైటపడే దారి కావాలి.

రెండు రోజుల క్రితం రమ తల్లి వచ్చి, పిల్ల విషయంలో ఆమె పడుతున్న ఆందోళనంతా చెప్పి వెళ్లింది.

"మొన్న మీ అమ్మగారు వచ్చి వెళ్లారు...." అంటూ ప్రారంభించి విజయలక్ష్మి ఒక్కొక్క విషయమే వివరంగా మాట్లాడుతూ వచ్చింది.

"రమా.... మన ఇష్టానికి వ్యతిరేకంగా, మన కోరికలకి అడ్డుగా ఏం జరిగినా ఎవరికైనా చిరాగ్గానే ఉంటుంది. కానీ మన కోరికల వల్ల మనకి అందుతున్నదేమిటి? అని ఎవరికి వాళ్లే ఆలోచించుకోవాలి.

చదువుకుంటున్న నీలాంటి ఆడపిల్లల బాధ్యత ఏమిటో, జీవితాన్ని ఎలా ఆలోచించుకోవాలో తెలియజెప్పే వాతావరణం మనకి లేదు.

"ప్రేమే సర్వస్వం, ఏదో రకంగా డబ్బు సంపాదించటమే జీవితం అని చూపించే సినిమాలు నిజం కావు.... ఫాషన్స్.... డ్రెస్‌లు.... అందాలు.... గొప్పకి గుర్తులు కావు. మన స్వేచ్ఛని దూరం చేసే శత్రువులు తల్లీ తండ్రీ అన్న భావన సరైంది కాదు. కోరికకి, ప్రేమకి మధ్య చాలా దూరం ఉంది. వస్తువులు వేరు.... జీవితం వేరు రమా....! నువ్వు ఈనాడు కోరుకుంటున్న వస్తువులు ఎప్పుడైనా సరే డబ్బుతో దొరుకుతాయి. కానీ సరైన జీవితం, సవ్యమైన ఆలోచన, ఆచరణల ద్వారానే అందుతుంది.

కంటికి కనిపించే విజయలక్ష్మి జీవితమే కాక, ఆమె మరో అంతరంగిక జీవితం కూడా అర్థమైంది రమకి. ఆ సాయంత్రానికి రమ మనసు చాలా వరకు తేలికపడింది. ఆలోచన ఓ క్రమంలో సాగుతూ వచ్చింది.

ప్రసాద్‌తో తను జీవితం పంచుకోవాలనుకుంటోంది. ఆ ఇష్టం తనకుంది. కానీ ప్రసాద్‌కి తన మీద ఉన్నది కేవలం కోరికేనేమో.... అతను కోరుకుంటున్నది కేవలం శారీరక అనుభవం.... కొంత రొమాంటిక్ టైమేనేమో....

ప్రస్తుతం ప్రసాద్ ద్వారా తనకి అందుతున్నవి కొన్ని వస్తువులు.... తీరుతున్నవి కొన్ని సరదాలు. అవి తనలో తట్టుకోలేనంత కంగారు, ఆందోళన కలిగిస్తున్నప్పుడు వాటి మీద వ్యామోహం వెంటనే వదులుకోవాలి. అలా వదులుకుంటేనే హాయిగా, ప్రశాంతంగా ఉంటుంది. అబద్ధాల బతుకూ తప్పుతుంది.

తనే కాదు.... తనలాంటి మనస్థితిలో సతమతమవుతున్న ఆడపిల్లలు వేలల్లో ఉన్నారు. ఫాషన్, స్టైల్.... రోజుకో డ్రెస్, పూటకో అలంకరణే గొప్ప జీవితం అన్న భ్రమ....

తనది తొందరపాటే... విజయలక్ష్మి ఆంటీ చెప్పినట్టు ఈనాడు ఆడదానికి కావల్సింది తనని తను నిలబెట్టుకోగలిగిన కెరియర్.... ఎవరి మీదా ఆధారపడకుండా ఒకరి దయాధర్మాలకే పరిమితం అవకుండా స్వతంత్ర జీవితాన్ని ఇవ్వగలిగిన కెరియర్....

ప్రసాద్, విజయలక్ష్మి ఆంటీ తన మనసులోని రెండు బలమైన కోరికల రూపాలు.... ప్రసాద్ ఆస్థి.... విజయలక్ష్మి ఆంటీ నిండైన జీవితం.... అవి దక్కవేమోనన్న కలతే.... తన కల.... ఆంటీ ఆ కలని ఎనలైజ్ చేసి చెప్పాక చాలా సందేహాలు తీరాయి.

ఇప్పుడు రమకి తల్లీ తండ్రీ మరో రూపంలో కనిపిస్తున్నారు. వాళ్ల డబ్బు లెక్కలే కాదు, తన గురించి అహోరాత్రాలు వాళ్లు పడే శ్రమ తెలుస్తోంది.

'అన్నం సరిగ్గా తినటం లేదేం.... చదువు కష్టంగా ఉందా.... ట్యూషన్ పెట్టుకుంటావా....' అని పదే పదే అడిగే వాళ్ల ఆప్యాయత.... 'వేళకి ఇంటికి వచ్చేయమ్మా....' అని చెప్పే జాగ్రత్తల విలువ తెలుస్తోంది.

ఆ రాత్రి చాలారోజుల తర్వాత ప్రశాంతంగా నిద్రపోయింది రమ.

తెల్లారాక ఎంతో నిబ్బరంగా ప్రసాద్‌కి ఫోన్ చేసింది, చేసి.... "నేను ఇవాళ రావటంలేదు.... నీకు మనస్ఫూర్తిగా ఇష్టం ఉంటే నువ్వే వచ్చి అమ్మానాన్నతో మన పెళ్లి విషయం మాట్లాడు... ఆ తర్వాతే ఇంక మన కలయిక.... ఒకవేళ నువ్వు రాలేకపోతే ఇవే మన ఆఖరి మాటలు..... బై...."

ప్రసాద్ ఏం బదులు చెప్పలేదు. అయినా రమకి ఏం అనిపించలేదు. ఫలితం ఏదైనా కానీ.... తను చెయ్యాల్సింది చేసింది. అంతే....

రమకి చాలా రోజుల తర్వాత ప్రసాద్ వ్యవహారం కంగారనిపించలేదు. ఆందోళన కలిగించలేదు.

• *ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 26-2-97 (కథాప్రభ)*